
సాక్షి
గుంటూరు
మంగళవారం । 24 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9635 టీఎంసీలు. ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2216 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. పలు కాల్వలకు 1920 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు ఎయిమ్స్ ఐదో వార్షికోత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఐదో వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆసుపత్రి ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.జవహర్ రెడ్డి, అతిథులుగా డాక్టర్ వేమూరి మూర్తితో పాటు పలువురు అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

రిపబ్లిక్ డే వేడుకలకు విజ్ఞాన్ విద్యార్థులు



కేశవ్‌కుమార్ రాయ్



మహ్మద్ షమా పర్వీన్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఇరువురు విద్యార్థులు న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలు వీక్షించేందుకు ఎంపికయ్యారని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కార్యాలయం సోమవారం తెలియజేసింది. దేశంలోని అన్ని యూనివర్సిటీల్లో మంచి ప్రతిభ చూపిన 50 మంది విద్యార్థులకు దేశ ప్రధానమంత్రితో కలిసి రిపబ్లిక్ డే వేడుకలను కర్తవ్యపథ్‌లోని ప్రధానమంత్రి బాక్స్ నుంచి చూసే అవకాశం ఉంటుంది. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన కేశవ్ కుమార్ రాయ్ (బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ 9.87 సీజీపీఏతో గోల్డ్ మెడల్), మహ్మద్ షమా పర్వీన్ (ఎంటెక్‌లోని అన్ని బ్రాంచ్‌లలో కెల్లా ఉత్తమ సీజీపీఏతో గోల్డ్ మెడల్)లు మాత్రమే ఉన్నారని తెలియజేసింది. రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించేందుకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

11న నవోదయ ప్రవేశ పరీక్ష

చిలకలూరిపేటటౌన్: నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారు హాల్ టికెట్లు నవోదయ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11తేదీ నిర్వహిస్తున్నట్లు, హాల్‌టికెట్లను రిజిస్ట్రేషన్ నంబర్ లేదా పుట్టినతేదీ ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సాంకేతిక కారణాలతో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కానివారు నేరుగా మండలంలోని మద్దిరాల నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని కోరారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 31తేదీ చివరి తేదీ అని, ఈ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గుర్తు చేశారు.

జోరుగా మిర్చి క్రయవిక్రయాలు



కొరిటెపాడు(గుంటూరు): మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,07,429 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ-నామ్ ద్వారా 98,686 బస్తాలు విక్రయాలు జరిగాయి. మిర్చి ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సరుకు యార్డుకు ఇప్పుడిప్పుడే వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి వచ్చే మిర్చి అంత నాణ్యతగా ఉండటం లేదు. తాలు ఎక్కువగా వస్తుంది. అందుకే రైతులు నిల్వ పెట్టడం కంటే అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరబెట్టి యార్డుకు తీసుకువస్తే ఆశించిన ధర వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు రూ.8,000 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు రూ.8,000 నుంచి రూ.26,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 43,886 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బాలబడిలో అభివృద్ధి సవ్వడి

నాడు-నేడుతో అంగన్‌వాడీ స్కూళ్లకు మహర్దశ

- జిల్లాలో 13 అంగన్‌వాడీ స్కూళ్ల నిర్మాణానికి రూ.20.80లక్షలు మంజూరు
- 55 సెంటర్లకు మరమ్మతుల నిమిత్తం ఒక్కోదానికి రూ.5లక్షలు మంజూరు
- ఫర్నీచర్ కొనుగోలుకు 25 సెంటర్లకు ఒక్కో దానికి రూ.2.50లక్షలు
- ఇప్పటికే రూరల్, అర్బన్ కేంద్రాలకు అద్దె పెంపు చేసిన ప్రభుత్వం

చిన్నారుల భావిజీవితానికి బాటలు వేయడంలో అమ్మ ఒడి - పాఠశాల మధ్యలో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఇంట్లో లభించే స్వేచ్ఛనిచ్చి, ఆటలు, పాటలు నేర్పడమే కాకుండా.. చిన్న చిన్న పాఠాలు వల్లెవేయిస్తూ, బడి వాతావరణాన్ని క్రమంగా అలవాటు చేసేందుకు ఉపకరిస్తాయి. పిల్లల మేధో, శారీరక ఎదుగుదలలో కీలకమైన అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే పౌష్టికాహారం అందించడంలో విప్లవాత్మకమైన అడుగులు వేసిన ప్రభుత్వం కొత్త కేంద్రాల నిర్మాణం, పాతవాటి మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు రూ.కోట్లు కేటాయించింది.

– నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్)

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రవేశపెట్టిన పలు కార్యక్రమాల ద్వారా రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. ఇందులో ప్రధానంగా నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు అంగన్‌వాడీ స్కూళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగానికి పెద్ద పీట వేస్తున్నారు.

జిల్లాలో 13 సెంటర్ల నిర్మాణాలకు అనుమతులు..

గుంటూరు జిల్లాలో 13 అంగన్ వాడీ సెంటర్ల(స్కూల్స్) నిర్మాణానికి ప్రభుత్వం రూ.20.80లక్షలు మంజూరు చేసింది. ఒక్కో స్కూల్‌కు రూ.13.50లక్షలు కేటాయించగా ఫర్నీచర్ నిమిత్తం అదనంగా ఒక్కో స్కూల్‌కు రూ.2.50లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే అవసరమైన ప్రాంతాల్లో సెంటర్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. వీలైనంత త్వరలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



కాకుమాను మండలం చినలింగాయపాలెంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్

మరమ్మతులు, ఫర్నీచర్‌కు రూ.2.75కోట్లు..

జిల్లాలో 55 సెంటర్లకు మరమ్మతులు చేసేందుకు గాను ఒక్కో దానికి రూ.5లక్షలు మంజూరైంది. ఇందులో రూ.2.50లక్షలు మరమ్మతులకు, రూ.2.50లక్షలు ఫర్నీచర్ నిమ్తితం మంజూరైంది. అంటే మొత్తం 55 కేంద్రాలకు రూ.2.75కోట్లు మంజూరు చేసింది. అదే విధంగా 25 సెంటర్లలో అవసరమైన ఫర్నీచర్ కొనేందుకు ఒక్కో దానికి రూ.2.50లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు	1480
6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు	54,184 మంది
3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు	22,297
గర్భిణులు	10,109
బాలింతలు	10,762 మంది

అంగన్‌వాడీ సెంటర్లకు అద్దె పెంపు

పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వం అద్దె పెంపు చేసింది. జిల్లాలో మొత్తం 1480 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా వీటిలో సొంత స్థలాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లు 358, రెంట్ ఫ్రీ 323, అద్దె ఇళ్లల్లో ఉన్న అంగన్ వాడీ సెంటర్లు 799 ఉన్నాయి. వీటికి గతంలో రూరల్ ప్రాంతాల్లో అద్దె రూ.1000 చెల్లిస్తుండగా ప్రస్తుతం రూ.2 వేలకు పెంచింది. అదేవిధంగా అర్బన్ ప్రాంతంలో గతంలో రూ.4వేలు అద్దె చెల్లిస్తుండగా ప్రస్తుతం రూ.6వేలకు పెంచింది.

ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణాలు..



నాడు-నేడు కార్యక్రమంతో అంగన్‌వాడీ స్కూళ్లు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ కమిటీలో నలుగురు తల్లులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీస్, అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో పనులు పర్యవేక్షణ జరుగుతుంటాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బేస్‌మెంట్ లెవల్‌లో నిర్మాణాలు ఉన్నాయి. వీలైనంత త్వరలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బి.మనోరంజని, ఐసీడీఎస్ పీడీ

జగనన్న గృహాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహనిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మురళీకృష్ణ యాదవ్ సోమవారం ఒప్రకటనలో తెలిపారు. ఒక కిలోవాట్ విద్యుత్ వరకు కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. దీనికి లబ్ధిదారులు వారి హౌస్ ఎలాంట్‌మెంట్ లెటర్, ఆధార్ జిరాక్స్ కాపీ, ఫొటోలు దరఖాస్తుతో జత చేయాలన్నారు. సంబంధిత ఏఈ కార్యాలయాల్లో సంప్రదించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కొందరు లబ్ధిదారులు తెలియక సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో రుసుము చెల్లిస్తున్నారని, చెల్లించాల్సిన అవసరం లేదని వివరించారు. లబ్ధిదారులకు సర్వీసు వైరు, మీటరు బోర్డు, ఎస్‌సీబీ, ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ఈసౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అప్రమత్తతే రక్ష

డీటీసీ షేక్ కరీమ్



మంగళగిరి: వాహనచోదకులు డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో అప్రమత్తంగా వ్యవహరించాలని డీటీసీ షేక్ కరీమ్ కోరారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మంగళగిరి – తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కాజ టోల్‌ప్లాజా వద్ద స్వచ్ఛత పక్వాడ-2023 కార్యక్రమంలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మంగళగిరి ఎంవీఐ విజయ సారధితో పాటు జిల్లాకు చెందిన పలువురు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- స్పందనకు 167 అర్జీలు

గుంటూరు వెస్ట్: ప్రజల నుంచి వచ్చే అర్జీలను సమయానికే పరిష్కరించాలని, దాటవేసే ధోరణికి స్వస్తి పలకాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కోర్టు కేసులపైనా సమయానికి నిర్దిష్టమైన అంశాలతో కోర్టులకు సమాచారమందించాలన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం, గణతంత్ర దిన వేడుకలకు సంబంధించి శాఖలకు అప్పగించిన పనులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత వస్తున్న ఈ కార్యక్రమాలు విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. స్పందనలో వచ్చిన 167 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా అధికారులు పరిశీలించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

ప్రత్యామ్నాయ స్థలాలిచ్చి ఆదుకోండి



30 ఏళ్లుగా పెదకాకాని మండలం, తక్కెళ్లపాడులో రోడ్డుకు ఇరువైపులా సుమారు 100 కుటుంబాల వారం జీవిస్తున్నాం. అంతా పేద దళిత, బీసీ కులాలకు చెందిన వారమే. కూలీనాలీ చేసుకుని జీవించే మమ్మల్ని ఖాళీ చేయమంటున్నారు. ప్రత్యామ్నాయ అవకాశమున్న చోట ఇళ్ల స్థలాలు ఇప్పించి ఆదుకోండి.

– తక్కెళ్లపాడు వాసులు

ఆస్తులున్నాయని పథకాలు ఇవ్వడం లేదు..



నేను డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. నా భార్య ఖాతాలో గతంలో విద్యాదీవెన పథకం కింద నగదు కూడా జమయింది. అయితే మా పేర్లతో ఆస్తులున్నాయని మాకు వచ్చే పథకాలు ఆపేశారు. జగనన్న ఇంటి స్థలం మంజూరు కూడా చేయడంలేదు. వాస్తవానికి మాకు కనీసం టూ వీలర్ కూడా లేదు. విచారించి, న్యాయం చేయండి.

– వి.సంపత్
వేజండ్ల, చేబ్రోలు మండలం

విజేఈఈ భవ!

ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ చదవాలనే విద్యార్థుల కలకు తొలిమెట్టు మొదలు కానుంది. దేశంలోనే ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రవేశ పరీక్షల అంకం నేటినుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్‌లో రెండు సెషన్లుగా జరిగే జేఈఈ మెయిన్ పరీక్షకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాలను ఎన్‌టీఏ సిద్ధం చేసింది.

- నేటి నుంచి జేఈఈ మెయిన్
- ఈనెల 24, 25, 28, 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహణ
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ఆన్‌లైన్ సెషన్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 9,500 మంది విద్యార్థులు



గతేడాది జేఈఈ మెయిన్‌కు హాజరవుతున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశానికై నిర్వహించే జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్షలు మంగళవారం నుంచి జరగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పేపర్-1, పేపర్-2 విధానంలో జరగనున్న బీఈ, బీటెక్, బీఆర్క్, ప్లానింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా దరకాస్తు చేసిన 9,500 మంది విద్యార్థులకు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఆన్‌లైన్ పరీక్షలకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యార్థులకు అడ్మిట్‌కార్డుతో పాటు అందజేసిన ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్‌లో పొందుపర్చారు. ఈనెల 24, 25, 28, 29, 30, 31తో పాటు ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నం..

ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించే లక్ష్యంతో విద్యాసంవత్సరం పొడవునా సన్నద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షలు జరిగే రోజున ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది.

- జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ విధించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంది.
- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పేపర్-1 పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. తదుపరి ఉదయం 8.30 గంటలకు విద్యార్థులను అనుమతించడం నిలిపివేస్తారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్న పేపర్-2 పరీక్షకు విద్యార్థులను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకే అనుమతిస్తారు. పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని తప్పక తెలుసుకోవాలి.
- పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లిన తరువాత ఆన్‌లైన్ పరీక్షకు సంబంధించి ఇన్విజిలేటర్లు అందించే సూచనలతో పాటు నియమ, నిబంధనలు తెలుసుకునేందుకు అరగంట సమయాన్ని కేటాయించిన కారణంగా విద్యార్థులను పరీక్షా సమయానికి అరగంట ముందు వరకే అనుమతించాలని ఎన్‌టీఏ మార్గదర్శకాల్లో పొందుపర్చింది. ఉదయం 9.00, మధ్యాహ్నం 3 గంటలకు ఖచ్చితంగా పరీక్ష ప్రారంభమవుతుంది.

కొడుకుల బారినుంచి కాపాడండి

ఓ వృద్ధ తండ్రి ఆవేదన



మెహబూబ్‌ఖాన్

కంటికి రెప్పలా కాపాడి.. అడిగినవన్నీ సమకూర్చి, విద్యాబుద్ధులు చెప్పించి, వ్యాపారంలో మెలకువలు నేర్పించి తన కుమారులకు 'బంగారు' భవిష్యత్తు ఇచ్చాడు ఆ తండ్రి. ఎదిగొచ్చారు కదా వ్యాపారంలో చేదోడుగా ఉంటారనుకుని అప్పగిస్తే, వయసు మీద పడింది ఒక మూలన కూర్చులేవా అంటూ ఇంటికే పరిమితం చేశారు. సరేలే ముదిమిలో అవసరాలు తీరుస్తూ ఆసరాగా ఉంటారనుకుంటే కోట్ల ఆస్తులు రాయించుకుని, వద్దు పొమ్మంటూ గెంటేశారు. కూతురు వద్ద మలిసంధ్య బతుకీడుస్తుండగా ఉన్న కొద్దిపొలం, ఆమె నగలు ఇవ్వాలంటూ కన్నతండ్రి అనికూడా చూడకుండా ఆ వృద్ధుడిని చితకబాదారు ఆ కర్కశ కసాయి కొడుకులు.

వివరాల్లోకి వెళితే గుంటూరు నగరంలోని సంగడిగుంట లాంచెస్టర్‌రోడ్‌లో ఉంటున్న మెహబూబ్‌ఖాన్‌కు 80 ఏళ్ల వయస్సు. గతంలో పూలమార్కెట్ సెంటర్‌లో బంగారం వ్యాపారం చేసేవాడు. ముగ్గురు కుమారులకు గతంలోనే కోట్ల రూపాయల ఆస్తులు/ డబ్బులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. భార్య షకీలబేగం కుమారుల వద్ద ఉంటుందని, తన వద్ద కుమార్తె ఉంటూ పోషిస్తుందన్నారు. ఈక్రమంలో పేరెచర్లలో ఉన్న పొలాన్ని కుమార్తెకు రాసివ్వాలని అనుకున్నానని, అయితే కుమారులు తన వద్దకు వచ్చి నగదు, ఆస్తి ఇవ్వాలని బెదిరిస్తున్నారని వాపోయారు. పలుమార్లు పిడిగుద్దులతో చితకబాదారని, రాత్రిళ్లు వచ్చి కుమార్తె నగలు, ఆస్తి ఇవ్వాలని కాళ్లు, చేతులతో కొడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఈమేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ వయసులో కుమారులు పెట్టే చిత్రహింసలను భరించలేక పోతున్నానని, గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారిని పిలిచి మందలించారని, అయినా వారిలో మార్పురాలేదన్నారు. వారి నుంచి రక్షణ కల్పించకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని రోదించడం చూపరులను కలిచివేసింది.

– నగరంపాలెం (గుంటూరు వెస్ట్)

జీఎన్ఎం పరీక్షలు ప్రారంభం



గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) నర్సింగ్ వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు వైద్య కళాశాలలో జిల్లావ్యాప్తంగా పలు నర్సింగ్ పాఠశాలలకు చెందిన 1474 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. తొలిరోజు పరీక్షకు 1330 మంది హాజరు కాగా, 144 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల చీఫ్ ఎగ్జామినర్‌గా గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అబ్జర్వర్‌గా అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌లు వ్యవహరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఫిబ్రవరి 1 వ తేదీ వరకు థియరీ పరీక్షలు, ఫిబ్రవరి 2 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని చీఫ్ ఎగ్జామినర్ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ తెలిపారు.

గుం'టూరు' వచ్చిన ప్రపంచ పర్యాటకురాలు



ఇటలీ టూరిస్ట్ ఎలీనా ఎగ్జీనా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ పర్యటనలో ఉన్న ఇటలీ దేశస్తురాలు ఎలీనా ఎగ్జీనా సోమవారం గుంటూరు నగరానికి వచ్చారు. గత మూడున్నరేళ్లుగా బైక్‌పై 28 దేశాలను సందర్శించిన ఆమె ప్రస్తుతం భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా చెన్నై నుంచి వైజాగ్ వెళ్తూ మార్గ మధ్యలో గుంటూరు పండరీపురంలోని పులుగు దీపక్ నీట్, జేఈఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మమేకమై మహిళా సాధికారతపై మాట్లాడారు. విద్యార్థినులు విద్యావంతులుగా ఆకాశమే హద్దుగా ఎదగాలని సూచించారు. తన పర్యటన విశేషాలను వివరిస్తూ బైక్‌పై మూడున్నరేళ్ల క్రితం మొదలైన తన ప్రపంచ యాత్ర ఇప్పటికి 28 దేశాల్లో ఎక్కడా ఒక్క హోటల్‌లో బస చేయకుండా, నిరంతరం కొనసాగడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విభిన్న సంస్కృతులు, భిన్నమైన ప్రదేశాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. ఎలీనాను సత్కరించిన శిక్షణా కేంద్ర నిర్వాహకుడు పులుగు దీపక్ భారతదేశ గొప్పతనాన్ని వివరించే స్పేస్ సైన్స్ పుస్తకాన్ని బహూకరించారు. గుంటూరులో తనకు లభించిన ఆదరణ, ఆత్మీయ స్వాగతంపై ఎలీనా ఆనందాన్ని వ్యక్తం చేశారు.



ఇటలీ దేశస్తురాలు ఎలీనా ఎగ్జీనాకు స్పేస్ సైన్స్ పుస్తకాన్ని బహూకరిస్తున్న పులుగు దీపక్

సీఎం జగన్ ఆశయ సాధనలో అండగా నిలుద్దాం

- బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ
- ఏడాది పొడవునా 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' కార్యక్రమాలు



కొరిటిపాడు(గుంటూరు): సంక్షేమాన్ని మహోద్యమంగా రూపుదిద్దిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనలో భాగస్వాములు అవుతున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. గుంటూరు పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 21న సీఎం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' పేరిట సేవా కార్యక్రమాలు ప్రారంభించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఏడాది కాలం పాటు గుంటూరు జిల్లాలోని పలు గ్రామాలలో తమ ఫౌండేషన్ ద్వారా వివిధ సేవలను చేపడుతున్నట్టు వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో, ఆయన అందిస్తున్న ఆదర్శవంతమైన పాలన చూసి ప్రేరణ పొంది ఆయనకు మద్దతుగా నిలవాలన్న ఆకాంక్షతోనే బజరంగ్ ఫౌండేషన్ స్థాపించినట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా, థలసేమియా బాధిత చిన్నారుల కోసం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా 1469 మంది రక్తదానం చేసినట్లు వివరించారు. అలాగే పోటీ పరీక్షలలో విద్యార్థులకు ఉచిత శిక్షణ, మరో వైపు మహిళలకు నారీ రుతువు పేరుతో శానిటరీ నాప్‌కిన్‌లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలు..

ఇప్పటి వరకు దాదాపు 51 గ్రామాల్లో బజరంగ్ ఫౌండేషన్ సేవలు అందించినట్లు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. గత నెల 21న పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో వేడుకగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమం ప్రారంభమైందని వివరించారు. ఈ క్రమంలో పొన్నూరు మండలం మామిళ్లపల్లి, వెల్లటూరు, పెదకాకాని మండలం కొప్పురావూరు, వెనిగండ్ల గ్రామాలలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. గ్రామాలలో నేత్ర జ్యోతిలో భాగంగా 3,526 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 2,842 మందికి కళ్లజోళ్లు అందించినట్లు పేర్కొన్నారు. 77మంది వలంటీర్లకు అవగాహన పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేయడంతోపాటు ఒక్కొక్కరికీ రూ.ఐదు లక్షల విలువైన ప్రమాద బీమా పాలసీ బాండ్లు ఉచితంగా అందించినట్లు తెలిపారు. విద్యాజ్యోతిలో భాగంగా 2,664 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేసినట్టు తెలిపారు. పెద్ద సంఖ్యలో కిశోర్ బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు ఇచ్చామన్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు భోజన ప్లేట్లు, పలకలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇలా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తామని మురళీకృష్ణ వివరించారు.

అర్జీదారులకు చట్ట పరిధిలో న్యాయం

జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్



వృద్ధుడి సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం స్పందన నిర్వహించారు. స్పందన హాల్‌లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆవరణలో అర్జీదారులతో ఎస్పీ మాట్లాడి, పోలీస్ అధికారులకు ఫోన్లు చేసి మాట్లాడారు. అర్జీదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని వారిని ఆదేశించారు. ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్బీ), ప్రకాష్‌బాబు (క్రైం) అర్జీలు స్వీకరించిన వారిలో ఉన్నారు.

రూ.4కోట్లకు ముంచారు..

సుమారు నాలుగైదు కోట్లకు మోసగించారని పలువురు బాధితులు వాపోయారు. తెనాలి మారీసుపేటకు చెందిన ఓ వ్యక్తి, అతడి కుటుంబ సభ్యులు సుమారు 30 ఏళ్లుగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం చేసేవారు. తమ వద్ద పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు అరువుగా, నగదు రూపేణా కొనుగోలు చేసేవాడు. అందరితో నమ్మకంగా ఉండేవాడు. ఈ క్రమంలో పలువురు వద్ద కోట్ల రూపాయల సరకు కొనుగోలు చేశాడు. డబ్బులు అడిగితే కాలయాపన చేశాడు. అయితే రెండు వారాల క్రితం అతను కుటుంబ సభ్యులతో పరారైనట్లు తెలిసింది. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదు.

– శ్రీనివాసరావు, భుజరంగరావు, పూర్ణచంద్రరావు, సుదర్శన్, ఎం.శ్రీనివాసరావు

కళాశాలలో సీటు ఇప్పిస్తానని..

ఓ కళాశాలలో అడ్మిషన్ విభాగంలో పని చేస్తున్నాను. సహచర ఉద్యోగి విజయవాడలో పనిచేసేవాడు. అక్కడ క్యాంపస్‌లో చదివే ఓ విద్యార్థికి బీటెక్ అడ్మిషన్ కోసం సంప్రదించారు. దీంతో తాను సూళ్ళూరుపేట వాసితో సంప్రదించగా, అతను చెన్నైకి చెందిన ఇద్దరిని పరిచయం చేశారు. దీంతో చెన్నైలోని వారికి ఆన్‌లైన్ ద్వారా రూ.4.70 లక్షలు, 80 వేలు చెల్లించాను. సదరు వ్యక్తులు సీటు ఇప్పించకపోగా డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు నాపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇప్పటికే తల్లిదండ్రులకు రూ.2 లక్షలు చెల్లించాను. న్యాయం చేయగలరని కోరుతున్నాను.

– ఎ.శ్రీకాంత్, పాలపర్రు, పెదనందిపాడు

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జీవ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శనివారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య జె. రాజశేఖర్ మాట్లాడుతూ 'జీవరసాయన శాస్త్రంలో సాంకేతిక అభివృద్ధి' అనే అంశంపై ఫిబ్రవరి 13, 14 తేదీల్లో యూజీసీ సౌజన్యంతో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి ఆచార్య ఎన్. వెంకట ప్రసూజ కోశాధికారిగా వ్యవహరించనున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి, మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె.వి.శాంతిశ్రీ పాల్గొన్నారు.

అమ్మ ఒడితో చిన్నారుల భవిష్యత్‌కు భరోసా

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పేదల భవిష్యత్ కోసం అందిస్తున్న నవరత్న పథకాల్లో భాగంగా అమ్మ ఒడి ద్వారా చిన్నారుల బంగారు భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఈ పథకం కింద కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున 91 మందికి రూ.11,83,000 చెక్కును అందజేశారు. ఈ మొత్తం విద్యార్థుల ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహంతో విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా విద్యాశాఖాధికారి శైలజ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాడేపల్లి రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పదేళ్లు పొడిగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక క్రిస్టియన్‌పేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తండ్రి బాటలో నడుస్తూ పేద ప్రజల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు కోట్లాది రూపాయలు నవరత్నాల రూపంలో అందజేస్తూ వారికి ఆత్మబంధువుగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఈదుల మూడి డేవిడ్ రాజు, మంగళగిరి నియోజకవర్గనాయకులు ముదిగొండ ప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాల రెడ్డి, బాలసాని అనీల్, చిలుకోటి మధు, పండు, అమృతరావు, అంబారావు, ఎన్.ప్రభాకర్, అశోక్, నాగబాబు, చిన్నబాబు, ఎం.విజయ్, డేవిడ్, సుధాకర్ పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ చట్టం పొడిగింపుపై హర్షం

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. 2013లో సబ్ ప్లాన్ చట్టం పదేళ్ల కాలపరిమితితో అమలులోకి వచ్చిందని చెప్పారు. 2023తో గడువు ముగుస్తుండటంతో ప్రభుత్వం ఆ చట్టాన్ని పునరుద్ధరిస్తూ జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి జిల్లాకు నోడల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేసి నిధులను అర్హులైన ఎస్సీ, ఎస్టీ ఆదివాసీలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.ఐజక్ విల్సన్, ఉపాధ్యక్షులు వై.యోహన్, ఎన్.నాగేశ్వరరావు, ఎంవీ రత్నం, మనోజ్, సుశీల్‌కుమార్ ఉన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పొడిగింపుపై మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు చుట్టుగుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల పక్షపాతిగా వారి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సబ్ ప్లాన్ చట్టాన్ని మరో పదేళ్లు పొడిగింపుపై హర్షం వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి 3న సాయి మందిర వార్షికోత్సవం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం వార్షికోత్సవం ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30లకు కాగడా హారతి, 6.00 గంటలకు క్షీరాభిషేకం, 8 గంటలకు బాబా వారికి అన్నాభిషేకంతో పాటు ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ సంగీత గాయనీ, గాయకులతో సంగీత విభావరి, జబర్దస్త్ కామెడీ షో కళాకారులతో హాస్యవల్లరితో పాటు డూప్‌స్టార్స్, మిమిక్రీ, మ్యూజిక్ షో కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి సేవలో పాల్గొని బాబా వారి కృపకు పాత్రులు కావాలని పాతూరి నాగభూషణం కోరారు.

ఇప్పటంలో అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డుకు, డ్రెయిన్‌కు అడ్డంగా ఉన్న బావిని తొలగిస్తున్న కార్పొరేషన్ అధికారులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో అనేక అవాంతరాల్ని అధిగమించి సోమవారం కార్పొరేషన్ అధికారులు అభివృద్ధి పనుల్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ప్రహరీలను కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చి తొలగిస్తుంటే టీడీపీ, జనసేన పార్టీలు పేదల ఇళ్లు కూలుస్తున్నారంటూ నానాయాగీ చేసి కోర్టుకు వెళ్లాయి. అయితే, కోర్టు వారికి మొట్టికాయలు వేసింది. తప్పుదోవ పట్టించినందుకు గానూ రూ. లక్ష చొప్పున అపరాధ రుసుం కట్టాలని కోర్టుకు వెళ్లిన 18 మందిని న్యాయస్థానం ఆదేశించింది. 90 శాతం అడ్డంకులు తొలగిపోవడంతో ముందుగా రోడ్డుకు ఇరువైపులా రూ. 56 లక్షలతో 540 మీటర్ల పొడవునా రెండు అడుగుల వెడల్పుతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఒక నేలబావి, రామాలయం అడ్డుగా ఉండడంతో ఆ ప్రాంత వాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తొలగించి, అభివృద్ధి చేయాలని కోరడంతో వాటిని అధికారులు తొలగించే పనిలో పడ్డారు. నెల రోజుల వ్యవధిలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మిస్తామని, డ్రైన్ టు డ్రైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ప్రభుత్వానికి రైతులు, వ్యాపారులు రెండు కళ్లు

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- మిర్చి యార్డులో దిగుమతి సంఘం కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల

కొరిటిపాడు(గుంటూరు): రైతులు, వ్యాపారులు రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తూ ఇద్దరికీ సమన్యాయం చేస్తూ సుపరిపాలన చేస్తోందని శాసన మండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఓ వైపు రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూనే మరోవైపు వ్యాపారుల సంక్షేమంపై పూర్తి చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డులో రైతులు, వ్యాపారులకు వెన్నుదన్నుగా మరింత సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. మిర్చి యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్‌దిగుమతి సంఘం నూతన కార్యాలయాన్ని ఏఎంసీ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నంతో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ కార్యాలయం గతంలో పట్నంబజారులో ఉండేదని, ఫలితంగా రైతులు, వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఇకపై ఆ పరిస్థితి లేకుండా, అందరికీ అందుబాటులో ఉండే రీతిలో మార్కెట్ యార్డు ఆవరణలోనే ఏర్పాటు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఒకే కుటుంబంలా కలసిమెలసి ఉండే దిగుమతి సంఘం నూతన కార్యవర్గం మరింత చొరవ తీసుకుని యార్డు దినదినాభివృద్ధిలో భాగం కావాలని కోరారు. త్వరలోనే దిగుమతి సంఘం కార్యవర్గంతో పాటు మిగిలిన అన్ని సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి యార్డును మరింత ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై సమగ్రంగా చర్చించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటామని తెలిపారు. దిగుమతి సంఘం అధ్యక్షుడు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి మాట్లాడుతూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కుర్రి సాంబిరెడ్డి, వ్యాపారులు కె.వేణుగోపాల్, టి.నారాయణ, శ్రీనివాసరెడ్డి, రాఘవరావు, టి.రామారావు, డి.నరేంద్రబాబు, కరీముల్లా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

గుంటూరు లీగల్: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ మూడో అదనపు జిల్లా జడ్జి జి.అర్చన సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోనంకి పవన్ కుమార్, ఆయన భార్య నాగకల్పన ప్రత్తిపాడు మండలంలోని తుమ్మలపాలెంలో నివాసం ఉంటున్నారు. మంగళగిరి రూరల్ మండలంలోని నవులూరు గ్రామానికి చెందిన తలతోటి సోమశేఖర్‌కు కోనంకి పవన్ కుమార్ కొంత డబ్బు అప్పుగా ఇచ్చాడు. ఆ డబ్బు వసూలు చేసుకునేందుకు తరచూ నవులూరు గ్రామానికి వెళ్తూ ఉండేవాడు. ఈ క్రమంలో పవన్ కుమార్ అదృశ్యం అయ్యాడు. ఆయన భార్య నాగకల్పన తన భర్త అదృశ్యంపై ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. డబ్బులు ఇస్తానని నమ్మ పలికిన సోమశేఖర్, పవన్ కుమార్‌ని నవులూరులోని తన ఇంటికి తీసుకెళ్లాడు. సుత్తి తీసుకొని తలపై కొట్టి పవన్ కుమార్‌ని హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని కాల్చే ప్రయత్నం కూడా చేశాడు. పవన్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన ప్రత్తిపాడు పోలీసులు విచారణలో హత్య విషయాలు బయటకు రావడంతో కేసును మంగళగిరి పోలీసులకు బదిలీ చేశారు. విచారణ అనంతరం మంగళగిరి పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాధారాలతో నేర నిరూపణ కావడంతో యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సూరిబాబు కేసు వాదించారు.

బీమాపై డ్రైవర్లకు అవగాహన

నెహ్రూనగర్: జిల్లాలోని డ్రైవర్లు బీమా చేయించుకోవాలని రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం సూచించారు. 18 నుంచి 24వ తేదీ వరకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ కార్యాలయంలో లారీ, స్కూల్ బస్, ఆటో డ్రైవర్లకు బీమాపై అవగహన సదస్సు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ వి.బ్రహ్మానందరెడ్డి, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ డివిజన్ మేనేజర్లు శ్రీధర్ కుమార్, మూర్తి పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఒంగోలు ఎడ్ల బలప్రదర్శన పోటీలు



ఎద్దుల యజమానికి షీల్డు, గిఫ్ట్ ప్యాక్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట డీఎస్ఏ స్టేడియంలో గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు బలప్రదర్శన పోటీలు సోమవారానికి రెండో రోజుకు చేరాయి.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆదివారం మొదటిరోజు నిర్వహించిన పాలపళ్ల విభాగంలో విజేతలైన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన వల్లభనేని మోహనరావు ఎడ్ల జత గెలుపొందగా, రెండో బహుమతిని నరసరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన మాదనబోయిన పోతురాజుయాదవ్ ఎద్దు, మూడో బహుమతిని నాదెండ్లకు చెందిన నలమోతు వేణుగోపాలరావు ఎడ్లు గెల్చుకున్నాయి.

ఈ విధంగా హాజరైన 28ఎడ్ల జతల్లో పదింటికి అవి నిర్ణయించిన సమయంలో బండలాగిన దూరాన్ని బట్టి బహుమతులను అందజేశారు. నిర్వాహక కమిటీ సభ్యులు చల్లానారపరెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, మూరే రవీంద్ర, పానుగోటి వెంకటరావు, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపుగుడిజాన్, గాడిపర్తి సీతయ్య పోటీలను పర్యవేక్షించగా, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి రెఫరీలుగాను, వ్యాఖ్యాతగా సూరపునేని రాధాకృష్ణ వ్యవహరించారు.

ది గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ గుంటూరు

రిజిస్టర్డ్ నెం.ఐ–908

మహాజన సభ మీటింగ్ నోటీసు

అయ్యా,

ది గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ గుంటూరు వారి మహాజన సభ సమావేశము సంఘ ప్రధాన కార్యాలయము, మెడికల్ కాలేజీ రోడ్డు, కన్నావారితోట, గుంటూరు నందు ది.10-02-2023 శుక్రవారము ఉదయం గం.11.30లకు జరుపుటకు నిర్ణయించినాము గాన సంఘ సభ్యులందరు హాజరు కావలసినదిగా కోరటమైనది.

స్థలము: గుంటూరు	డి.హరిగోపాలం	శ్రీమతి వై.భాగ్యలక్ష్మి
తేది : 23-01-2023	బిజినెస్ మేనేజరు	చైర్మన్

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్, తెనాలి

GDCC BANK

కేంద్ర కార్యాలయము : తెనాలి
పరిపాలనా కార్యాలయము : గుంటూరు.

మహాజన సభ సమావేశపు నోటీసు

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి., తెనాలి నెం. 530 యొక్క మహాజన సభ సమావేశము

తేదీ : 15-02-2023 బుధవారం
సమయము : ఉదయం 11 గం॥లకు
స్థలము : బ్యాంకు పరిపాలనా కార్యాలయము, యన్.టి.ఆర్. సహకార భవన్, 2/13 బ్రాడీపేట, గుంటూరు

నందు జరుగును. కావున బ్యాంకు మహాజన సభ సభ్యులందరు సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరడమైనది. ఎజెండా అంశములు సభ్యులకు విడిగా పంపించబడును. మహాజన సభ అనంతరం లంచ్ ఏర్పాటు చేయడమైనది.

ప్రదేశం : గుంటూరు
తేది. 23-01-2023
అన్ని సభ్య సంఘములకు

సం/- శ్రీమతి టి. కృష్ణవేణి
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు



అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోతే..
కూతురు అమ్మకు అమ్మ అవుతుంది.
నాన్న మనసుకు కష్టం కలిగితే..
కూతురు చేయి ఓదార్పు అవుతుంది.
ఈ పదేళ్లలో ప్రభుత్వాలు, ప్రజలలోనూ
బాలికలకు సంబంధించిన సమస్యలపై శ్రద్ధ పెరిగింది.
ప్రపంచ వేదికపై బాలికలు తమ గళాన్ని వినిపించడానికి
మరిన్ని అవకాశాలు పెరిగాయి.
అయినప్పటికీ, బాలికల హక్కులపై
అవగాహన పరిమితంగానే ఉంది.
బాలికలు తమ సామర్థ్యాన్ని నెరవేర్చుకోవడానికి
సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు
వారి అడుగులకు మరింత ఊతాన్ని ఇవ్వాల్సిన తరుణమిది.
'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా
ఈ విషయంపై దృష్టి సారిద్దాం..

నేషనల్ గర్ల్ చైల్డ్ డే

ఒక్క చిరునవ్వు... కోటి కాంతులు

'కూతుళ్ళే మన భవిష్యత్తు' అనే మాటని మన ప్రధాని నరేంద్రమోదీ వివిధ సందర్భాలలో చెప్పడం పదే పదే విన్నాం. వివిధ రంగాలలో మహిళల విజయాలను గుర్తిస్తున్నాం. ఆడపిల్లల సాధికారతకు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. అయినా 'ఆమె' పురోగతికి కుటుంబం, సమాజం చేయాల్సిన కృషి ఎంతో ఉంది.

కుటుంబంలో స్కీమ్స్

ఒకప్పుడు కూతురు ఇంటి గుండె మీద కుంపటి. ఇప్పుడు కుటుంబ సమస్యలను ఓ దరిచేర్చగల చుక్కాని. అందుకే పుట్టేది ఆడపిల్లైనా, మగపిల్లవాడైనా 'సరే' అనే దిశకు కుటుంబం చేరుకుందనే చెప్పాలి. కానీ, 'ఆమె' పెరుగుదలలో ఇంటి నుంచే ఎన్నో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. అందుకు తల్లితండ్రులే అమ్మాయిలను ప్రోత్సహించడానికి స్కీమ్స్ పెడుతుండాలి. ఆమె కలలకు, ఆశయాలకు మద్దతునివ్వాలి. ఎలాంటి సమస్య అయినా 'పరువు' అనే భయంతో కాకుండా బలమైన వెన్నుగా నిలవాలి.

డిజిటల్ జనరేషన్, అవర్ జనరేషన్

ఈ నినాదం ఇప్పుడు బాలికలకు అత్యవసరమైనది. డిజటల్ యుగంలో 'ఆమె'కు వాటి వినియోగంలోనూ పూర్తి అవగాహన అవసరం. ఇప్పటికే అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు డిజిటల్ పరికరాల వాడకంలో వెనకంజలో ఉన్నట్టు ప్రపంచవ్యాప్త అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. డిజిటల్ మాధ్యమం ద్వారా అమ్మాయిలను ప్రభావంతంగా మార్చే మానవ ఆసక్తి కథనాలు, బ్లాగ్‌లు, వీడియోలు, రీసోర్సింగ్ చేసే స్ఫూర్తిదాయకమైన నెట్‌వర్క్‌లు, సంస్థల గురించి తెలుసుకునే అవకాశాలను కల్పించాలి.

చట్టం.. హక్కులు

సమాజంలో ధైర్యంగా, శక్తిమంతంగా ఎదిగేందుకు ఆమె చుట్టూ ఉన్న రక్షణ, న్యాయ వ్యవస్థల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు కుటుంబంతోపాటు ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనది.

నాయకత్వాన్ని పెంచుదాం

అవగాహన 'ఆమె'కు అవకాశాలను విస్తృతం చేస్తుంది. నాయకత్వాన్ని ఎంచుకునేలా ఎదగాలంటే ..

▸ మన ప్రాంతంలోని అమ్మాయిలను వెనక్కి నెట్టివేసే అంశాల గురించి అవగాహన పెంపొందించడంలో, వాటిని పరిష్కరించడంలో ముందుండాలి. ▸ బాలికలకు అందాల్సిన సేవలను మరింతగా బలోపేతం చేయాలి. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా వారి నాయకత్వం, చర్యలు, ప్రభావాన్ని సమష్టిగా విస్తరింపజేయాలి. ▸ ప్రపంచవ్యాప్తంగా బాలికలు లింగ అసమానత, వివక్షకు గురవుతున్నారనేది వాస్తవం. ఇవి బాలికలను ప్రతిచోటా వెనకడుగు వేయిస్తున్నాయి. అందుకే లైంగిక వేధింపులు, హింస, అసమానతలు, హక్కుల గురించి అవగాహన కల్పించడంలో వెనకంజ వేయకూడదు. ▸ విద్య, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతలను తెలియజేయడమే కాదు వాటిని అందించడంలోనూ ముందంజలో ఉండాలి. ▸ అమ్మాయిలు తమలోని ప్రతిభను కనబరచడమే కాకుండా పూర్తి స్వేచ్ఛతో జీవించే అవకాశాన్ని కల్పించాలి. ▸ చాలా ప్రాంతాలలో అమ్మాయిలను త్వరగా పెళ్లి చేసుకోమని బలవంతం చేయడం లేదు. అయినా, ఎలాంటి హింస జరిగినా ఆడపిల్లలకు తమ గొంతు వినిపించే హక్కు ఉంది. ఈ విషయాన్ని వారికి తప్పక తెలియజేయాలి. ▸ రోల్ మోడల్స్‌గా ఉన్నవారిని బాలికలకు పరిచయం చేయిస్తూ ఉండాలి. బాలికా నాయకత్వం పట్ల ప్రజలలో అవగాహనను పెంచాలి. ▸ అలజడులు, వలసలు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో సామాజిక సహాయ సేవలను పొందుతున్నప్పుడు బాలికలు అనుభవించే అసమానతలను పరిష్కరించడానికి అధికారులు, విధాన నిర్ణేతలు మరింతగా దృష్టి సారించాలి.

ఒక ఆడపిల్ల తన స్వచ్ఛమైన చిరునవ్వుతో ఇంటిని ప్రకాశవంతం చేస్తుంది. జీవితాన్ని ఎలా గడపాలో నేర్పేది ఆమె. కుటుంబంలో ప్రతి ఒక్కరినీ ప్రేమలో పడేలా చేసే స్వచ్ఛమైన ఆత్మ. కాబట్టి ప్రతి ఇంటినీ తన నిస్వార్థ ప్రేమతో, ప్రకాశంతమైన కాంతితో నింపే ఆమె భవిష్యత్తును ఉజ్వలం చేద్దాం. సమాజంలో సమానమైన అవకాశాలను కల్పించడానికి ప్రయత్నిద్దాం.

ఇందిరాగాంధీ 1966 జనవరి 24న దేశానికి మొదటి మహిళా ప్రధానమంత్రి అయ్యారు.అందుకే ప్రభుత్వం ఈ రోజుని జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రత్యేకంగా ఎంచుకుంది. భారత ప్రభుత్వం 2008లో ఆడపిల్ల పట్ల సమాజంలో చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 24ని జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది.

బాల్య ముద్రలు

ఆ నీలి రంగు గౌను

బాల్యం మళ్లీ దొరకని సీతాకోకచిలుక. బాల్యం మనిషికి తన అమలిన రూపాన్ని చూపే అద్దం. బాల్యాన్ని తలుచుకోని వారు ఉండరు. బాల్యం ఏర్పరిచే గాఢమైన ముద్రలే మనిషి భవిష్యత్తు ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయి. 'నా గురించి నేను రాసుకోవాలనుకున్నప్పుడు ఎన్ని సినిమాలు చేశాను, ఎవరితో సినిమాలు చేశాను రాయాలనిపించ లేదు. నా బాల్యం గురించే రాసుకోవాలనిపించింది' అంది నటి దీప్తి నావల్. 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆమె తన పుస్తకం 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్' గురించి మాట్లాడింది. బాల్య జ్ఞాపకాలు పంచుకుంది.



'నాకు ఊహ తెలిశాక వచ్చే మొదటి జ్ఞాపకం... ఒక రోజు సాయంత్రం మా ఇంట్లో అమ్మ లేదు. జీజిని అడిగితే ఉత్తుత్తికే సినిమాకెళ్లిందిలే అంది. అమృత్‌సర్‌లో మా ఇల్లు హాల్ బజార్‌లో ఉండేది. సినిమా హాలు మా ఇంటి దగ్గరే. నేను ఇంట్లో నుంచి బయటకు గెంతి అమ్మ దగ్గరకు వెళతాను అని సినిమా హాలు వైపు పరిగెత్తాను. నాకు బాగా గుర్తు. అప్పుడు గాలి దుమారం రేగింది. వీధిలో చెత్త పైకి రేగింది. షాపులు దుమ్ముతో నిండిపోయాయి. నేను మాత్రం హాలు వైపు పరిగెడుతూనే ఉన్నాను. నా వెనుక మా జీజీ. ఆ గాలిలో అర్థమయ్యీ కాక ఎటు వెళ్లేదాన్నోగాని మా జీజి గబుక్కున నన్ను జవురుకొని ఇంటికి తీసుకెళ్లింది. తీసుకెళ్లాక ఆమె అన్న మాట– మంచి ఇంటి ఆడపిల్లలు సినిమా కు వెళ్లకూడదమ్మా అని. ఏ ముహూర్తాన ఆమె ఆ మాట అన్నదో (నవ్వు). నా జీవితం మొత్తం సినిమాల్లోనే గడిచింది'....

•••

'సినిమాల్లో నేను ఎన్నో కాస్ట్యూమ్స్ తొడుక్కుని ఉంటాను. రోజువారీ జీవితంలో ఫ్యాషన్లు ఫాలో అయి ఉంటాను. కాని నాకు ఇష్టమైన బట్టలు అంటే చిన్నప్పుడు నేను తొడుక్కున్న నీలి రంగు గౌనే. ఆ కథ నాకు చాలా ఇష్టం.

అప్పుడు నాకు పదేళ్లు ఉంటాయి. మా ఇంటికి ఏదో మేగజీను వచ్చేది. అందులో ఒక అడ్వర్టయిజ్‌మెంట్‌లో ఇద్దరు పాపలు ఒకే లాంటి నీలి రంగు గౌన్‌లలో నిలబడి ఉంటారు. మా అమ్మ ఆ ఫొటో చూసి' పండక్కు ఇలాంటి గౌన్లు వేయాలి మీకు' అంది నాతో మా అక్కతో. దీపావళి పండగ దగ్గర్లో ఉంది. దీపావళికి కొత్త బట్టలు తొడుక్కుని టపాకాయలు కాల్చడం ఆనవాయితీ. మా అమ్మ ఇంట్లో ఒక తెల్ల గుడ్డ ఉంటే మమ్మల్ని తీసుకుని అద్దకం దుకాణానికి తీసుకు వెళ్లింది. మేగజీన్‌లోని ఫొటో చూపించి ఆ బట్టకు అదే రంగు నీలం వేయమని చెప్పింది. అతడు తలాడించాడు. మామూలు నీలం కాదు ఇది... పర్షియన్ నీలం... అలాగే ఉండాలి అంది మా అమ్మ. అతను మళ్లీ సరే అన్నాడు. మొత్తం మీద నీలంగుడ్డ మా ఇల్లు చేరింది. ఇక గౌనుగా మారాలి.

మా అమ్మకు బట్టలు కుట్టడం ఆసక్తే అయినా పండగ బట్టలు కాబట్టి మా వీధిలో ఉండే శిక్కు దర్జీకి ఇచ్చింది. ఆయన అప్పటికే కుప్పలు తెప్పలుగా పండగ గుడ్డలు కుట్టే పనిలో ఉన్నాను. పండక్కు ఇస్తానని మాట ఇచ్చాడు. మా ఇంటి నుంచి ఆ దర్జీ షాపు కనిపిస్తుంది. నేను మా అక్క రోజూ షాపు వైపు చూసేవాళ్లం. షాపు దాకా వెళ్లి మా గుడ్డ కదిలిందో లేదో చూసేవాళ్లం.

పండగ వచ్చింది. సాయంత్రమైపోయింది. అందరూ టపాకాయలు కాల్చడం మొదలెట్టారు. మేమిద్దరం మాకు చేరని నీలి రంగు గౌన్లను తలచుకుని మొహం మాడ్చుకుని కూచున్నాం. టపాకాయలు కాల్చలేదు. ఏడూ ఎనిమిది అయిపోయింది. మా బజార్‌లో షాపులన్నీ మూత పడిపోయాయి. దర్జీ షాపు లైటు ఒక్కటే వెలుగుతూ ఉంది. ఆ తర్వాత భోజనాలు చేశాం. వీధిలో టపాకాయల మోత ఆగిపోయింది. మేము పైజామాల్లోకి మారి నిద్రపోబోతున్నాం. అప్పుడు మా ఇంటి గేటు తట్టిన చప్పుడు అయ్యింది. నేను పరిగెత్తాను ఎవరొచ్చారో అర్థమయ్యి. ఆలస్యానికి మన్నింపు కోరుతున్న ముఖంతో రెండు నీలం రంగు గౌన్లు పట్టుకుని దర్జీ.

ఓ.. మేము వెంటనే ఆ గౌన్లు తొడుక్కుని అప్పుడు పండగ మొదలెట్టాం. టపాకాయలు కాల్చి వీధి వీధంతా నిద్ర లేపాం. పదే పదే నేను ఇష్టంగా తలచుకునే జ్ఞాపకం ఇది.

•••

మా అమ్మ అప్పుడప్పుడు పొరుగునే ఉన్న పేదపిల్లల బడికి వెళ్లి పాలు పంచి వచ్చేది. ఒకరోజు అమ్మతో పాటు నేనూ వెళ్లాను. చాలా మంది చిన్న పిల్లలు అమ్మ దగ్గరకు వచ్చి ఆమె పంచుతున్న పాలు తీసుకుని తాగి సంబర పడ్డారు. మేము తిరిగి వస్తుంటే ఒక పిల్లాడు పరిగెత్తుకుంటూ గిన్నె పట్టుకుని వచ్చాడు. 'అయ్యో... నాన్నా పాలు అయిపోయాయి. ఇంత ఆలస్యం ఏంటి?' అంటే వాడు నిరాశ నిండిన ముఖంతో 'మా ఇంట్లో గిన్నె లేదు. అమ్మ వేరే ఇంటి నుంచి తెచ్చి ఇచ్చింది' అన్నాడు.

మన దేశ పేదరికం గురించి నా మనసు మీద శాశ్వత ముద్ర వేసిన సంఘటన అది.

•••

నాకు పద్నాలుగేళ్లు ఉండగా నా స్నేహితురాలికి మానసిక ఆరోగ్యం దెబ్బ తింది. ఆ రోజుల్లో పిచ్చి పట్టడం అంటే వారిని బహిష్కరించడమే. ఆ అమ్మాయికి అలా కావడంతో నేను చాలా డిస్టర్బ్ అయ్యాను. ప్రతి వీధిలో చాలామంది ఆడవాళ్లు అలాంటి స్థితిలో కనిపించేవారు. మేము జట్కాలో స్కూలుకు వెళుతుంటే ఒకామె మా వెనుకే పరిగెత్తేది. నాకు చాలా బాధ కలిగేది. వారికి ఏదైనా చేద్దామనే నేను అమెరికాలో సైకాలజీ చదివాను. ఇప్పటికీ నేను మానసిక ఆరోగ్యం సరిగా లేని స్త్రీల గురించి ఆలోచిస్తాను. వారికి నేటికీ సరైన వైద్యం అందడం లేదు. నేను నా కవిత్వ పుస్తకంలో ఎన్నో కవితలు మానసిక ఆరోగ్యాన్ని కోల్పోయిన స్త్రీల గురించి రాశాను. రాస్తాను.

దీప్తి నావెల్ జీవితంలోని ఇలాంటి అనేక అంశాలు 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'లో ఉన్నాయి.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

అమృత్ పత్తి అదుర్స్!

పత్తి తొలి దశలో మొక్కకు ఎక్కువగా వచ్చిన కొమ్మలు.. కాయలను చూపుతున్న రైతు విజయ్ (ఫైల్)





మొదటి రెండు వరుసల మధ్య 4 అడుగులు, తర్వాత రెండు వరుసల మధ్య 6 అడుగుల దూరం చొప్పున పాటించి సాగు చేసిన పత్తి చేను

ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించిన ఆదిలాబాద్ జిల్లా రైతు

మహారాష్ట్రకు చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ రూపొందించిన పద్ధతి ఇది

పత్తి దిగుబడుల పరంగా ఎకరానికి 20 క్వింటాళ్లు సాధించిన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కొల్హారికి చెందిన యువ రైతు ఫడ్ విజయ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెట్టింపు దిగుబడి సాధించిన విషయం ఆ నోటా ఈ నోటా తెలుసుకొని పరిసర గ్రామాల రైతులు ఆసక్తిగా పొలాన్ని చూసి వెళ్తున్నారు. సాధారణ సాగులో కొంత మందికి 6 నుంచి 8 క్వింటాళ్లు, మరికొంత మందికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అయితే, ఈ రైతు ఏకంగా రెట్టింపు కంటే అధిక దిగుబడి సాధించడమే రైతులను ఆకర్షిస్తోంది.

ఫడ్ విజయ్‌కు మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా అంబోడ గ్రామంలో చుట్టాలు ఉన్నారు. ఒకసారి ఆ గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ అమృత్ ప్యాటర్న్‌లో సాగు చేయడాన్ని గమనించాడు. దిగుబడి అధికంగా వస్తుందని ఆ రైతులు చెప్పడంతో ఆ వైపు మొగ్గు చూపాడు.

అమృత్ పద్ధతి అంటే..?

యవత్‌మాల్ జిల్లా మహాగావ్ తాలూకా అంభోద గ్రామానికి చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ తన క్షేత్రంలో అనేక ఏళ్ల పాటు ప్రయోగాలు చేసి ఈ సాగు పద్ధతిని రూపొందించారు. అందువల్లనే అమృత్ ప్యాటర్న్ అని పేరు వచ్చింది. ఏకంగా 50 క్వింటాళ్ల వరకు ఎకరంలో పత్తి దిగుబడి సాధించిన ఘనత ఆయనిది.

ఆదిలాబాద్ జిల్లాలో సాధారణంగా పత్తి సాగులో రైతులు మొక్కల మధ్య కొంచెం అటూ ఇటుగా ఒక అడుగు, వరుసల మధ్య 3 నుంచి 4 అడుగులు లేదా 4 నుంచి 5 అడుగుల దూరం పాటిస్తారు. అమృత్ ప్యాటర్న్‌లో మొక్కల మధ్య దూరం కచ్చితంగా ఒక అడుగు ఉండే చూస్తారు. ఒక వరుస మధ్య 4 అడుగులు, ఆ పక్కన వరుస మధ్య దూరం 6 అడుగుల దూరం పాటిస్తారు. అంటే.. మొదటి రెండు వరుసల మధ్య దూరం నాలుగు అడుగులు.. రెండు, మూడు వరుసల మధ్య ఆరు అడుగుల దూరం అనుసరిస్తారు. ఇదే తీరులో చేనంతా పాటిస్తారు. ఇదే విధానాన్ని విజయ్ అవలంభించారు.



ఏడు అడుగులు పెరిగిన పత్తి చేనులో విజయ్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

అమృత్ పద్ధతిని అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధ్యమవుతుంది. ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడే అవసరం పడదు. కలుపు తీయడంతో పాటు ఎరువులు, మందుల ఖర్చుల్లో చాలా ఆదా అవుతుంది. అధిక సాంద్రతతో పూత, కాత రావడం జరుగుతుంది.

– సాయిప్రణీత్ (96768 83233), వ్యవసాయ విస్తరణాధికారి, కొల్హారి గ్రామం



నెల తర్వాతే ఎరువులు..

పత్తి సాగులో మొదటి నెల రోజుల పాటు ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడలేదు. ఇలా చేయటం వల్ల మొక్కకు కొమ్మలు ఎక్కువగా వస్తాయి. విత్తిన నెల తర్వాత ఎకరాకు ఒక బ్యాగు 10:26:26 వేశారు. ఆ తర్వాత నెలలోనూ అదే మోతాదులో అదే ఎరువుతో పాటు అతి తక్కువ ధరకు లభ్యమయ్యే పురుగుల మందు వాడినట్టు వివరించారు.

మూడో నెల తర్వాత 5 కేజీల సల్ఫర్, ఆ తర్వాత 25 కేజీల మెగ్నీషియం నెలకు అందిస్తే సరిపోతుందని విజయ్ తెలిపారు. తద్వారా ప్రతి మొక్కకు వచ్చే కొమ్మలైనా ప్రధాన కొమ్మ, పిల్ల కొమ్మలు చాలా తక్కువ దూరంలో వస్తాయని తెలిపారు. పూత, కాత ఎక్కువగా రావడంతో పాటు రాలిపోకుండా ఉంటాయని విజయ్ వివరించారు.

సాళ్ల మధ్య ఎక్కువ దూరం పెట్టడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడి వస్తోంది. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని అనుభవపూర్వకంగా విజయ్ చెబుతున్నారు. ఎకరానికి రూ. 20 వేలు ఖర్చయ్యింది. 20 క్వింటాళ్ల పత్తి తీసిన తర్వాత మళ్లీ నీటి తడి ఇచ్చారు. ఫలితంగా మున్ముందు కూడా మరికొంత పత్తి దిగుబడి రావచ్చని విజయ్ ఆశిస్తున్నారు.

– గొడిసెల కృష్ణకాంత్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్, సాక్షి, ఆదిలాబాద్.

సాగు పద్ధతి మార్చుకొని అధిక దిగుబడి సాధించా...

రెండేళ్ల కింద పత్తి సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. మహారాష్ట్రలో కొంతమంది రైతులు అవలంభిస్తున్న అమృత్ ప్యాటర్న్‌లో గతేడాది పత్తి సాగు చేశాను. కొన్ని కాయలు కూడా కుళ్లిపోయాయి. అప్పుడు 9 నుంచి 11 క్వింటాళ్ల మధ్య దిగుబడి వచ్చింది. అమృత్ విధానాన్ని పూర్తిస్థాయిలో పాటించకపోవడంతో దిగుబడి అంతకు పరిమితమైంది. రెండో ఏడాది.. గడిచిన వానా కాలంలో ఈ విధానంలో అమృత్ ప్యాటర్న్‌లో అన్ని పద్ధతులను పూర్తిస్థాయిలో అవలంభించాను. ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది.

– ఫడ్ విజయ్ (77024 42958), ఇన్నోవేటివ్ పత్తి రైతు, కొల్హారి గ్రామం, గుడిహత్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

సాగుబడి

శ్రావణ కార్తె
జనవరి 24 నుంచి

మొబైల్ ఈవీ కూరగాయల కూలర్!

● తెలంగాణ నాబార్డ్ తోడ్పాటుతో రూపొందించిన పుణే స్టార్టప్ రుకార్ట్

● రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయం 150% పెరిగే అవకాశం



చిన్న, సన్నకారు కూరగాయలు, పండ్ల రైతుల ఆదాయం పెంపొందించే లక్ష్యంతో మహారాష్ట్ర పుణేకు చెందిన నలుగురు ఐఐటీయన్లు 'రుకార్ట్' పేరిట స్టార్టప్ సంస్థను స్థాపించి ఏ రకమైన విద్యుత్తూ అవసరం లేని కూరగాయలు, పండ్లను నిల్వ ఉండే కూలర్‌ను రెండేళ్ల క్రితమే రూపొందించారు. ఇప్పుడు విద్యుత్ బ్యాటరీతో నడిచే వ్యాన్‌కు సబ్జీ కూలర్‌ను నాబార్డ్ తోడ్పాటుతో అనుసంధానించారు.

సబ్జీ (కూరగాయల) కూలర్‌లో వంద కిలోల ఆకుకూరలు, పువ్వులు, కూరగాయలను 4 నుంచి 6 రోజులు తాజాదనం పోకుండా నిల్వ చేయవచ్చు. అందుకు ఈ సబ్జీ కూలర్‌కు కావాల్సింది రోజుకు 20 లీటర్ల నీరు మాత్రమే. ఎటువంటి విద్యుత్తూ అవసరం లేదు. పర్యావరణ అనుకూలమైన 'మెరుగైన ఆవిరి శీతలీకరణ' ఆధారిత ఆటోమైజ్డ్ కోల్డ్ స్టోరేజీని రుకార్ట్ సంస్థ అందిస్తోంది.

ప్రత్యేక మెటల్‌తో తయారు చేసిన సబ్జీ కూలర్ గోడలోకి నీరు పోయాలి. బయటి వాతావరణంలో వేడి వల్ల ఈ నీరు ఆవిరవుతూ లోపలి కూరగాయలకు చల్లదనాన్నిస్తుంది.



ఇది ఉద్యాన ఉత్పత్తులను తాజాగా నిల్వ ఉంచడానికే కాదు.. అరటి, నిమ్మ, మామిడి, బొప్పాయి మొదలైన పండ్లను సహజంగా మగ్గబెట్టే గదిగా కూడా పనిచేస్తుందని తయారీదారులు చెబుతున్నారు.

సబ్జీ కూలర్ అరెకరం కూరగాయల లేదా పండ్ల తోట ఉన్న రైతుకు లేదా తన ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే రైతుకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని పొలం దగ్గర లేదా ఇంటి దగ్గర లేదా మార్కెట్‌లో ఆరుబయట, గోదాములలో సులువుగా ఏర్పాటు చేసుకోవచ్చు. 5 రాష్ట్రాల్లో రైతులు, బెంగళూరులోని సహజ సమృద్ధ ఆర్గానిక్ ప్రొడ్యూసర్స్ కంపెనీ, ఏలూరులోని హరిత మిత్ర వంటి ఎఫ్.పి.ఓ.లు, రిటైల్ అమ్మకందారులు ఇప్పటికి 425 సబ్జీ కూలర్లను ఉపయోగిస్తున్నారు.

మొబైల్ కూలర్‌తో మరింత ఆదాయం

తెలంగాణ నాబార్డు ఆర్థిక తోడ్పాటుతో రుకార్ట్ సంస్థ విద్యుత్ బ్యాటరీతో నడిచే మొబైల్ సబ్జీ కూలర్ వ్యాన్‌ను రూపొందించింది. సిద్దిపేట జిల్లా ములుగులోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పి.ఓ.)లో ఈ నెల 23న దీన్ని ఆవిష్కరించారు. తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకొనే రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయాన్ని 150% పెంపొందిస్తుందని మొబైల్ ఎలక్ట్రిక్ సబ్జీకూలర్ వ్యాన్ దోహదపడుతుందని రుకార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వికాస్ ఝా తెలిపారు.

మొబైల్ సబ్జీ కూలర్ పూర్తి చార్జింగ్‌తో గంటకు 25 కి. మీ. వేగంతో వంద కి.మీ. నడుస్తుంది. 350 కిలోల వరకు బరువు మోస్తుంది. కూరగాయలు, పూలు, ఆకుకూరల రంగు, తాజాదనం, దృఢత్వాన్ని కాపాడుతుంది. వృథాను 15% అరికడుతుంది. దీనిపై పెట్టే పెట్టుబడిని 7 నెలల్లోనే తిరిగి రాబట్టుకోవచ్చని వికాస్ ఝా వివరించారు. వివరాలకు.. 88790 49787, 88956 341918.

మార్చి నుంచి మెత్తళ్ల/పరిగెల సీడ్ సరఫరా



విటమిన్ 'ఎ' తదితర పోషకాలు పుష్కలంగా ఉండే చిరు చేపలు మెత్తళ్ల (పరిగెల) విత్తనోత్పత్తిలో శాస్త్రవేత్తలు సాధించిన విజయం గురించి ఈ నెల 10న 'సాక్షి సాగుబడి' కథనం ద్వారా తెలుసుకున్నాం కదా. మెత్తళ్ల సీడ్ మనకు ఎప్పటికి చేతికి అందుతుందీ అని పలువురు రైతులు ఆత్రతను వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలో సీడ్ ఉత్పత్తి చేసిన హేచరీని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించింది. మార్చి నెల నుంచి సీడ్‌ను విక్రయిస్తామని ఒడిషాలోని బిశ్వాల్ ఆక్వా ఫామ్ అండ్ హేచరీ అధిపతి సౌరబ్ కుమార్ బిస్వాల్ 'సాక్షి'కి తెలిపారు. జగత్సింగ్‌పూర్ జిల్లా తులంగ గ్రామంలో ఈ హేచరీ ఉంది. భువనేశ్వర్ నగరానికి 100 కి.మీ. దూరంలో తారాదీప్ వెళ్లే మార్గంలో తులంగ ఉంటుంది. మెత్తళ్ల ఫిష్ స్పాన్ (50–60 గంటల వయసున్న పిల్లలు)ను మార్చి మొదటి వారం నుంచి రైతులకు విక్రయిస్తారు. లక్ష స్పాన్ ధర రూ. 1,500. ఫ్రై (10–15 రోజుల పిల్లలు)ని మార్చి 15 నుంచి సరఫరా చేస్తారు. వెయ్యి ఫ్రై ధర రూ. 200. ఆగస్టు–సెప్టెంబర్ వరకు మెత్తళ్ల సీడ్ ఉత్పత్తి, సరఫరా జరుగుతుంది. పాలిథీన్ బ్యాగ్‌లలో చేప పిల్లలను ఆక్సిజన్‌తో పాటు నింపి సిద్ధం చేసిన తర్వాత 30 గంటల్లోగా గమ్యం చేర్చాలని బిస్వాల్ తెలిపారు. రోజూ ఆంధ్రప్రదేశ్‌కు 10–15 ఇన్సులేటెడ్ వ్యాన్లు వెళ్తూ ఉంటాయని, వాటిలో మోల సీడ్‌ను తరలించవచ్చన్నారు. ఇతర వివరాలకు.. 93376 62527.

26 నుంచి సేంద్రియ సాగు, విలువ జోడింపుపై 3రోజుల శిక్షణ

సేంద్రియ సాగు విధానం, అందుకు అవసరమైన కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 26, 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడు గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో 3 రోజుల రైతు శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఉ. 10 నుంచి సా. 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666, 95538 25532 ఫోన్ నెంబర్లలో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. భోజనం, వసతి సదుపాయం ఉంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న 30 మంది ఏపీ రైతులకే ఈ అవకాశం.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్